క్లుప్తంగా

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నరసాపురం: ఉమ్మడి ఏపీ దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను శుక్రవారం నరసాపురంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని 22వ వార్డు కొప్పినీడి వారి సెంటర్‌లో కాపు, మాల సంఘాల నాయకులు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్తపల్లి నాని, నియోజకవర్గ మాలల న్యాయ పోరాట సమితి అధ్యక్షుడు సోడదాసి శ్రీధర్, మాజీ ఏఎంసీ చైర్మన్ దొండపాటి స్వాములు, వంగలపూడి జక్కరయ్య మాట్లాడుతూ మన రాష్ట్ర అభివృద్ధికి సంజీవయ్య చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో కొప్పినీడి శివాజీ, చినిమిల్లి నాని, పక్కా రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు



పారిశుధ్య వాహనాల డ్రైవర్లతో మాట్లాడుతున్న కమిషనర్

నరసాపురం: పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే సహించేదిలేదని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పేర్కొన్నారు. శుక్రవారం కమిషనర్ పారిశుధ్య వాహనాల డ్రైవర్లు, సిబ్బందితో రోజువారీ పారిశుధ్య పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది కచ్చితంగా సమయానికి విధులకు హాజరుకావాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటి వద్దకూ వెళ్లి చెత్తను సేకరించాలని చెప్పారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని సూచించారు. ప్రజల్లో ఈ అంశంపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఆయన వెంట డీఈ ప్రవీణ్‌చంద్ర, ఏఈ కిషోర్ ఉన్నారు.

అంగన్‌వాడీల్లో నాణ్యమైన విద్య



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ చెల్లుబోయిన ఇందిర

యలమంచిలి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి బిడ్డకు ప్రతి రోజూ కనీసం రెండు గంటలు అధిక నాణ్యత కలిగిన ప్రీ–స్కూల్ విద్యను మాతృ భాషలో అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పోషణ్ భీ– పడాయి భీ కార్యక్రమం చేపట్టిందని ఐసీడీఎస్ సీడీపీఓ చెల్లుబోయిన ఇందిర చెప్పారు. ఈ కార్యక్రమం రెండో రోజు శుక్రవారం యలమంచిలి, కొంతేరు హైస్కూల్స్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలంతా ఈ పథకాన్ని గర్భిణులకు, బాలింతలకు వివరించి మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలంతా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి



అమరులైన జవాన్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పాలకొల్లు అర్బన్: జీవీఎస్‌వీఆర్ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పుల్వామా ఉగ్రవాదుల దాడిలో అమరులైన జవాన్లకు విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీ ప్రసాద్ అమరుల త్యాగాలను విద్యార్థులకు వివరించారు. అమరుల చిత్రపటాలకు పూలమాల వేసి భారత మాతాకీ జై, జై జవాన్ అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు.

ప్లేస్కూల్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

పెనుగొండ: ఆచంట మండలం వల్లూరులో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్లేస్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి టి.అప్పల స్వామి, పి.రాం ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆచంట మండల విద్యాశాఖాధికారి ఉషారాణికి వినతి పత్రం సమర్పించారు. ప్లేస్కూల్‌లో చిన్నారుల భద్రత లేదని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. అధికారులు సత్వరం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఒత్తిడి దూరం చేసేలా శిక్షణ

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ
- నూటికి నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పదో తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దీంతో మండలంలోని ప్రతి పాఠశాలలోనూ పాఠశాల ముగిసిన తరువాత ఒక గంట పదో తరగతి విద్యార్థులను ప్రత్యేకంగా చదివిస్తున్నారు. గ్రేడుల వారీగా విద్యార్థులను విభజించి పాఠ్యాంశాల్లో వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా చదివిస్తున్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు సిలబస్ పూర్తి చేశారు. ప్రతి పాఠ్యాంశాన్నీ రివిజన్ చేయిస్తూ ముఖ్యమైన పాఠ్యాంశాలను ప్రత్యేకంగా చదవిస్తున్నారు.

11 పరీక్షా కేంద్రాలు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించడానికి 11 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు. గతంలో 12 కేంద్రాలు ఉండేవి. ఈ ఏడాది గురుకుల విద్యాలయ కేంద్రాన్ని రద్దు చేశారు. పట్టణంలో 8 కేంద్రాలు, పాలకొల్లు మండలంలో 3 కేంద్రాలు ఎంపిక చేశారు. పాలకొల్లు మండలం, పట్టణంలో ప్రైయివేట్, ఉన్నత పాఠశాలలు మొత్తం 35 ఉన్నాయి. వీటిలో ప్రయివేట్ పాఠశాలలు 18 మంది ఉండగా ఈ పాఠశాలల నుంచి సుమారు 1650 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి సిద్ధపడుతున్నారు. అలాగే పట్టణ, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు 17 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 926 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

పాలకొల్లు నియోజకవర్గంలో విద్యార్థులు ఇలా..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
పాలకొల్లు పట్టణం	07	465
పాలకొల్లు	10	461
యలమంచిలి	13	595
పోడూరు	08	498

స్పెషల్ క్లాసులు పెడుతున్నారు



ఉపాధ్యాయులు ఇప్పటికే సిలబస్ పూర్తి చేశారు. రివిజన్ చేయిస్తున్నారు. స్పెషల్ క్లాసులు పెట్టి పాఠ్యాంశాల్లో అనుమానాలను నివృత్తి చేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 4గంటలకు లేచి చదువుతున్నారు. 500 మార్కులు పైగా తెచ్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాను.

– వీరా సుహృత్, దగ్గులూరు

దత్తత తీసుకుని చదివిస్తున్నారు



పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయుడూ పదో తరగతి విద్యార్థులను దత్తతతీసుకున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా చదవిస్తున్నా రు. ఇంటికి ఫోన్ చేసి తల్లిదండ్రులను ఆరా తీస్తున్నారు. అన్ని పాఠ్యాంశాలు బాగా చదివాను. ప్రతి సబ్జెక్టులోనూ 90 శాతం పైగా మార్కులు సాధించగలనని నమ్మకం కలిగింది.

– కుక్కల పుష్ప, భగ్గేశ్వరం

మంచి మార్కులు సాధిస్తాను



పదో తరగతి పరీక్షలకు ప్రత్యేక శ్రద్ధతో చదువుతున్నా. మంచి మార్కులు సాధించాలని ప్రయత్నిస్తున్నా. ఇంజనీరింగ్ చదవాలని ఉంది. దానికి తగ్గట్టుగా ప్రయత్నిస్తున్నా. ప్రతి రోజూ ఉపాధ్యాయులు ఇంటికి ఫోన్‌చేసి నా తండ్రితో మాట్లాడుతున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 5గంటల వరకు పాఠశాల ఆవరణలో స్పెషల్ క్లాసులు పెడుతున్నారు.

– బీశెట్టి వైశాలి, గవరపేట

పరిశోధనలను అభివృద్ధి చేసుకోవాలి



నైపుణ్యాభివృద్ధి సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

పెనుగొండ: అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధన రంగం వైపు మళ్లి వాటిని అభివృద్ధి చేసుకోవాలని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి సదస్సులో పాల్గొన్నారు. రాబోతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి వారి భావితరాలకు మంచి బాటలు వేయాలన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ జువాలజీ విభాగ ఆచార్యులు మట్టారెడ్డి జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్‌పై అవగాహన కల్పించారు. భారత విద్యా మంత్రిత్వ శాఖ ఆధీనంలో ఈ సంస్థ నడుస్తుందని, మంచి విద్యా సంస్థలను గుర్తించి నాణ్యమైన విద్యనందించడానికి విశేష కృషి చేస్తుందన్నారు. యూనివర్సిటీ ఆంగ్ల విభాగ ఆచార్యులు విద్య, ఉద్యోగ అవకాశాలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సదస్సు కో ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వినూత్నంగా ప్రేమికుల దినోత్సవం



పేదలతో ప్రేమికుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ప్రేమికుల దినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. పట్టణంలోని పేదలు, రిక్షా కార్మికులు, యాచకులను కార్యాలయం వద్దకు రప్పించి వారి సమక్షంలో ప్రేమికుల దినోత్సవాన్ని నిర్వహించారు ఆర్డీఓ దాసి రాజు. కేక్ కట్ చేసి పేదలకు తినిపించారు. అలాగే పేదలకు పండ్లు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రాజు మాట్లాడుతూ మన తోటి వారికి ప్రేమను పంచే మంచి రోజుగా కూడా ప్రేమికుల దినోత్సవాన్ని జరుపుకోవచ్చని చెప్పారు. తాను గత 15 ఏళ్లుగా ప్రేమికుల దినోత్సవాన్ని ఇదే విధంగా జరుపుకుంటున్నాని గుర్తు చేశారు. కార్యక్రమంలో నరసాపురం తహసీల్దార్ టి.రాజ రాజేశ్వరి, ఆర్ఐ మిరియాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లంకలకోడేరులో డ్రైడే ర్యాలీ



పాలకొల్లు మండలం లంకలకోడేరులో డ్రై డే ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: గ్రామాల్లో దోమల బెడద ఎక్కువగా ఉన్నందున ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేయాలని మెడికల్ ఆఫీసర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరులో శుక్రవారం డ్రై డే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లోనూ, పూల కుండీల్లోనూ, ఫ్రిజ్‌లలో, ఎయిర్ కూలర్లలో నీటి తొట్టెలు, పాడేసిన పాత ప్లాస్టిక్ సీసాలలో మూడు రోజుల కంటె ఎక్కువ రోజులు నీటి నిల్వలు ఉంటే దోమలు గుడ్లు పెట్టి లార్వాలు తయారై దోమలు వృద్ధి చెందుతాయని చెప్పారు. తద్వారా డెంగీ, మలేరియా, చికున్ గున్యా తదితర విష జ్వరాలు వచ్చే అవకాశాలున్నాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా. నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



అమరావతిలో సీఎంఓలో వినతి పత్రం సమర్పిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం

పెనుగొండ: వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల్లోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆసంఘ రాష్ట్ర అధ్యక్షుడు కూనపరెడ్డి సుధాకరరాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా శుక్రవారం అమరావతిలో క్యాలెండర్ ఆవిష్కరించి, సీఎం కార్యదర్శికి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. మినిమమ్ స్కేలు అమలు చేయాలని, ఆప్కాస్ వ్యవస్థను కొనసాగించాలని. జీతభత్యాలు నేరుగా ఏఎంసీల నుంచే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వివరించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్, ఉపాధ్యక్షుడు ఎ.శ్రీనివాస్, కోశాధికారి డీసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారని వివరించారు.

చెరువుల పనుల నిలిపివేత

ఉండి: మండలంలోని కోలమూరు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన చెరువు రిపేర్ పనులను శుక్రవారం అధికారులు అడ్డుకున్నట్లు ఎఫ్‌డీఓ రాంబాబు తెలిపారు. గ్రామంలోని ఓఎన్‌జీసీ రోడ్డును ఆనుకుని అల్లూరి శ్రీనివాసరాజు, పీత వెంకట్రావు అనే రైతుల చేపట్టిన చెరువు రిపేరు పనులు నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో వాటిని రెవెన్యూ, ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని వాటిని నిలిపేశామని ఎఫ్‌డీఓ తెలిపారు. అలాగే మండంలోని అందరూ ఆక్వారైతులు తమ చెరువుల గట్లు రోడ్లు, కాలువ గట్లు, పంట బోదెలను ఆనుకుని లేకుండా నిబంధనల ప్రకారం మూడు గజాలు విడిచిపెట్టి సీపేజ్ బోదెలను కూడా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎఫ్‌డీఓ తెలిపారు.

హామీలను గాలికొదిలేసిన కూటమి సర్కార్

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి



ముదునూరిని ప్రసాదరాజును సత్కరిస్తున్న కోడే విజయలక్ష్మి, నాయకులు

నరసాపురం: అనేక వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ప్రజలుకు ఇచ్చిన హామీలను పూర్తిగా గాలికొదిలేసిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నా రు. వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన కోడే విజయలక్ష్మి శుక్ర వారం నరసాపురం పార్టీ కార్యాలయంలో ముదునూరిని మర్యాదపూర్వకంగాకలిశారు. పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ పార్టీ మహిళా విభాగం ప్రస్తుతం అత్యంత కీలకమన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న గత ఐదేళ్లపాటు రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేశారన్నారు. నేడు ఒక్క సంక్షేమ పథకం కూడా అమల్లో లేకుండా పోయిందన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టి పని చేయాలని చెప్పారు. పార్టీ అప్పగించిన బాధ్యతలు విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. కూటమి సర్కార్ మోసాలను ప్రజలు గ్రహించారని చెప్పారు. కూటమి సర్కార్ ఏడు నెలల పాలన ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ కేంద్రపాలకమండలి సభ్యుడు పీడీ రాజు, పాలా రాంబాబు, కడలి రాంబాబు, భీమవరం పార్టీ నేతలు కాండ్రేకుల శ్రీనివాస్, డీవీడీ ప్రసాద్, గాదిరాజు రామరాజు, పేరిచర్ల సత్యనారాణరాజు, ఇంటి సత్యనారాయణ. చిగురుపాటి రాజు, లక్కు త్రిమూర్తులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నరసాపురం రూరల్: మండలంలోని (బాలికలు), వేములదీవిలోని (మత్స్యకార బాలుర) మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకులంలో 2025–2026 విద్యా సంవత్సరానికి గానూ 5,6,7,8 మరియు 9వ తరగతులలో ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించినట్లు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 15 నుంచి మార్చి 15వ తేదీ వరకూ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్‌లు, కుల ధ్రువీకరణపత్రం, స్టడీ సర్టిఫికెట్, విద్యార్థి ఫొటోతో ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో అప్లై చేయాలని సూచించారు. మరిన్ని వివరల కునరసాపురం (బాలికలు)– 98665 59627, వేములదీవిలోని (మత్స్యకార బాలుర)–91216 15923 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

రేపు ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

యలమంచిలి: స్థానిక మంచినీటి చెరువు గట్టున పునర్నిమించిన శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు ఆదివారం, సోమవారం రెండు రోజులపాటు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి గోపి కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో ఆదివారం ఉదయం స్వామికి పంచామృతాభిషేకం, అనంతరం సువర్చలా హనుమాన్ కల్యాణోత్సవం నిర్వహిస్తారు. సోమవారం ఉదయం సువర్చల సహిత హనుమాన్ రథోత్సవం నిర్వహిస్తారు. రాత్రి హైదరాబాద్‌కు చెందిన నృత్య గురువు డాక్టర్ ఎస్‌వి భారతి కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందని కమిటీ సభ్యులు వివరించారు.

దళిత కాలనీలో అధ్వానంగా డ్రెయినేజీ



రాజీవ్‌నగర్‌లో చెత్తతో నిండిపోయిన మురుగునీరు



లంకలకోడేరు రాజీవ్‌నగర్‌లో మెయిన్ డ్రెయిన్ దుస్థితి

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు శివారు దళిత కాలనీల్లో మెయిన్ డ్రెయిన్ అధ్వానంగా మారింది. ఈ డ్రెయిన్ శుభ్రం చేసి చాలా రోజులైందని స్థానికులు చెబుతున్నారు. దీంతో చెత్తతో నిండిపోయి, మురుగునీరు పారుదల నిలిచిపోయింది. అసలే దోమలతో పగలు, రాత్రి తేడా లేకుండా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. రాజీవ్‌కాలనీ, పెదపేట, కోడిదుంప లో మురుగు డ్రెయిన్‌లో నీరు మెయిన్ రోడ్డులోని డ్రెయిన్‌లో చేరుతుంది. అయితే ఈ డ్రెయిన్‌లను శుభ్రం చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయిన్‌లను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

పేదల ఇళ్ల తొలగింపు అన్యాయం

భీమవరం: పట్టణంలోని గణపతిరాజు నగర్‌లో పేదల ఇళ్లను తొలగించాలని చూడడం అన్యాయమని సీపీఎం జిల్లా నాయకుడు బి వాసుదేవరావు అన్నారు. శుక్రవారం సీపీఎం బృందం గణపతిరాజునగర్‌లోని పేదల ఇళ్లను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ గత 60 ఏళ్లగా 30 కుటుంబాల పేదలు ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారని, కాయ కష్టం చేసుకోవడం తప్ప మరొక ఆదాయం లేని నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వారి స్వలాభం కోసం పేదలను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. పేదలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇళ్లు తొలగించాలని హెచ్చరికలు జారీ చేసి రెడ్ మార్కులు పెట్టడం దారుణమన్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు వెంటనే జోక్యం చేసుకొని పేదల ఇళ్లకు రక్షణ కల్పించాలని వాసుదేవరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.త్రిమూర్తులు, ఎం.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు



విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న వేద పండితులు

పాలకొల్లు అర్బన్: మండలంలోని గవరపేటలో నూతనంగా నిర్మించిన శ్రీ దాసాంజనేయస్వామి, శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ ర్యాలి శివరామకృష్ణప్రసాద్ (సిద్ధాంతి), ర్యాలి శివాజీ తో పాటు 9 మంది వేద పండితుల బ్రహ్మత్వంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. నూతనంగా ప్రతిష్ఠించనున్న శ్రీదాసాంజనేయస్వామి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివార్ల విగ్రహాలకు ధాన్యాధివాసం నిర్వహించారు.

రహదారి ఇలా.. ప్రయాణమెలా?



అధ్వానంగా ఉన్న వేదంగిపాలెం-అరట్లకట్ట రోడ్డు

పోడూరు: వేదంగిపాలెం-అరట్లకట్ట రహదారి అభివృద్ధి పనులు గత రెండేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఆ రహదారిపై ప్రయాణించడానికి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దాదాపు 2.9 కిలోమీటర్ల దూరం ఉండే ఈ రహదారి గతంలో మెటల్‌రోడ్డుగా ఉండేది. పోడూరు మండలంలోని వేదంగిపాలెం, కొమ్ముచిక్కాల, పాలకొల్లు మండలంలోని వాలమర్రు, అరట్లకట్ట గ్రామాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు, రైతులకు ఈ రహదారి ఎంతో ఉపయోగపడుతుంది. గత ప్రభుత్వ హయంలో ఈ రోడ్డును వెడల్పు చేసి బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు దాదాపుగా రూ.2.5కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే ప్రారంభంలో పనులు వేగంగా జరిగినా మధ్యలో నిలిచిపోయాయని, రోడ్డు విస్తరణ చేసి పైన మెటల్ చిప్స్ వేశాక పనులు నిలిపివేశారని చెబుతున్నారు. మెటల్‌చిప్స్ వేశాక రోలింగ్ సక్రమంగా లేకపోవడంతో పలుచోట్ల రహదారి భారీ గోతులతో ఎత్తుపల్లాలుగా ఉంది. రహదారి పనుల గురించి పంచాయతీరాజ్ ప్రాజెక్ట్స్ విభాగం ఏఈ సూర్యకుమార్‌తో మాట్లాడగా కాంట్రాక్టర్ మధ్యలో పనులు నిలిపేశారని, ఏడాది కిందట నోటీసు ఇచ్చినా పనులు తిరిగి ప్రారంభించకపోవడంతో మరో కాంట్రాక్టర్‌తో పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

గోతులతో నరకయాతన

ఈ రహదారి మార్గం భారీగోతులతో పలుచోట్ల ఎత్తుపల్లాలుగా ఉండడంతో కార్లు, ఆటోలు వెళ్లడానికి వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరోవైపు ద్విచక్రవాహనాలపై ప్రయాణం కూడా ప్రమాదకరంగా ఉంది. రాత్రిళ్లు గోతులు సరిగ్గా కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి వెంబడి ఉండే పొలాలకు రైతులు నిత్యం ఈ మార్గంలో వెళుతుంటారు. పొలాల దగ్గరకు ఎరువుల బస్తాలు వంటివి తీసుకెళ్లాలంటే గోతులు, ఎత్తుపల్లాల వల్ల బస్తాలు కిందపడిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్లుగా ఇదే దుస్థితి ఉందని ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భారీ గోతులతో అవస్థలు



ఏదైనా లోడు వేసుకుని కిరాయికి ఈ రోడ్డులో వెళుతుంటే భారీగోతులవల్ల ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వ్యాను పక్కకు ఒరిగిపోతుంది. కనీసం గోతులు పూడ్చి ఎత్తుపల్లాలు సరిచేసి తాత్కాలికంగానైనా మరమ్మతులు చేయాలి. – పాలపర్తి రాము, వ్యాన్ డ్రైవర్

త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి



రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిపివేయడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురి స్తే గోతుల్లో నీరు నిలిచి రోడ్డు మరింత అధ్వానంగా మారుతుంది. రోడ్డుపనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి.

– తానేటి సురేష్, కొమ్ముచిక్కాల